సాక్షి కాకినాడ

ఆదివారం । 2 । జూన్ । 2024



నిబంధనలు అతిక్రమిస్తే కేసులే..

ఈ నెల 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని ఏలూరు రేంజ్ శాంతిభద్రతల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి రవిప్రకాష్ హెచ్చరించారు.

8లో



సత్యదేవుని రథానికి రక్షణ

అన్నవరం సత్యదేవుని నూతన టేకు రథానికి అధికారులు రక్షణ ఏర్పాట్లు చేపట్టారు. 'తేరుకు రక్షణ ఈ తీరునా?' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి వారు స్పందించారు.

గరిష్టం/కనిష్టం
40.0°/30.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	40.5	30.0
కాకినాడ	32.8	24.0
అమలాపురం	39.0	29.0

న్యూస్‌రీల్

తొండంగిలో 66.4 మిల్లీమీటర్ల వర్షపాతం

కాకినాడ సిటీ: జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా శనివారం సగటున 15.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తొండంగి మండలంలో 66.4, అత్యల్పంగా ఏలేశ్వరం మండలంలో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో.. తాళ్లరేవు 48.2, కోటనందూరు 32.6, కాకినాడ రూరల్ 28.6, యు.కొత్తపల్లి 26.2, కాజులూరు 22.4, తుని 19.4, కిర్లంపూడి 17.4, గొల్లప్రోలు 10.2, కాకినాడ అర్బన్ 9.4, సామర్లకోట 8, కరప 7.6, రౌతులపూడి 7.4, శంఖవరం 5.6, పెదపూడి 4.8, పిఠాపురం 4.2, పెద్దాపురం 3.6, ప్రత్తిపాడు 2, జగ్గంపేట 1.8.

ఐటీఐ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 10 తుది గడువు

కాకినాడ సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఈ నెల 10 తుది గడువు అని కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్ ఎంవీజీ వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ జిల్లాల్లో అడ్మిషన్‌కు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కాకినాడ, జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐలు, అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపుగా వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులను మెరిట్ జాబితాలో పరిగణించరని స్పష్టం చేశారు.

రూ.1.70 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న విజయ శ్రీనివాస్ దంపతులు

కిర్లంపూడి: చిల్లంగి గ్రామంలో ఏలా నది ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మద్రె విజయ శ్రీనివాస్, ఝాన్సీదేవి దంపతులు రూ.1.70 లక్షల విరాళం సమర్పించారు. తన తల్లిదండ్రులు వరలక్ష్మి, వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం శ్రీనివాస్ ఈ విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు.

విత్తన దుకాణాలపై విజిలెన్స్ దాడులు



స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గొల్లప్రోలు: స్థానికంగా విత్తన, పురుగు మందుల దుకాణాలపై రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి (ఐపీఎస్) ఆధ్వర్యాన శనివారం దాడులు జరిగాయి. విజిలెన్స్, వ్యవసాయ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి శ్రీ శివ ఏజెన్సీ, స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీలు చేశారు. స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌లో స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడంతో సుమారు రూ.1,49,472 విలువైన పత్తి విత్తనాల విక్రయాలు నిలుపు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాల నాయుడు, శ్రీనువాసరెడ్డి, భార్గవ మహేష్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అప్పనపల్లి క్షేత్రం.. ఆధ్యాత్మిక పరవశం

మామిడికుదురు: అప్పనపల్లి క్షేత్రానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీబాల బాలాజీ స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని చూసి పరవశులయ్యారు. కొత్త ఆలయంతో పాటు పాత గుడిలో కొలువైన స్వామిని దర్శించుకున్నారు. 3,849 మంది భక్తులు రాగా, 3,061 మంది అన్న ప్రసాదం స్వీకరించారని చెప్పారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,17,050 ఆదాయం లభించింది. నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.53,540 విరాళాలుగా వచ్చాయని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2,70,590 ఆదాయం సమకూరిందన్నారు.

కళాశాల గంట మోగింది

- ఇంటర్ నూతన విద్యా సంవత్సరం ప్రారంభం
- తెరచుకున్న జూనియర్ కళాశాలలు
- తొలి రోజు అంతంత మాత్రంగా హాజరు



కళాశాలకు వస్తున్న విద్యార్థినులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియెట్ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా జూనియర్ కళాశాలలు శనివారం పునఃప్రారంభమయ్యాయి. దీంతో దాదాపు రెండు నెలల వేసవి సెలవుల అనంతరం కళాశాలల్లో గణగణమంటూ గంట మోగింది. పదో తరగతి అనంతరం ఇంటర్‌లో చేరిన విద్యార్థులు భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో తొలి రోజు తరగతులకు హాజరయ్యారు. అయితే కళాశాలల ప్రారంభమైన మరుసటి రోజు ఆదివారం కావడంతో విద్యార్థులు పెద్దగా కళాశాలలకు హాజరు కాలేదు. దీంతో పలు కళాశాలల్లో హాజరు అంతంత మాత్రంగానే కనిపించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024–25 విద్యా సంవత్సరానికి గాను గత నెల 31న రివైజ్డ్ అకడమిక్ క్యాలెండర్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు విడుదల చేసింది.

ఆన్‌లైన్ మూల్యాంకనం చేస్తూ..

ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకూ ప్రభుత్వం ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించింది. వీటి ఫలితాలను గత ఏప్రిల్ 13వ తేదీన విడుదల చేశారు. వీటిలో ఫెయిలైన, బెటర్‌మెంట్ కోరుకున్న విద్యార్థులకు గత నెల 24 నుంచి 31వ తేదీ వరకూ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు న్విహించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు ఆన్‌లైన్ స్పాట్ వేల్యుయేషన్ పేరిట సరికొత్త సంస్కరణకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దీని ప్రకారం సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్నది. మరోవైపు కళాశాలలు కూడా పునఃప్రారంభం కావడంతో లెక్చరర్లు టైమ్ టేబుల్ ప్రకారం తమ పీరియడ్‌లలో పాఠాలు బోధిస్తూ, అడ్మిషన్ డ్రైవ్ చేస్తూనే, తీరిక సమయాల్లో ల్యాప్‌టాప్ లేదా డెస్క్ టాప్ కంప్యూటర్లలో సప్లిమెంటరీ పరీక్షల ఆన్‌లైన్ మూల్యాంకనం కూడా చేపట్టనున్నారు.

సర్కారీ కళాశాలల్లో ప్రవేశాలకు..

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఇప్పటికే అడ్మిషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కళాశాలల సమీప ప్రాంతాల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఈ అడ్మిషన్ డ్రైవ్ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులోకి తీసుకుని వచ్చిన వసతి సౌకర్యాలు, ల్యాబ్‌లు, డిజిటల్ విద్య, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ) ద్వారా బోధన, నిష్ణాతులైన అధ్యాపకులు, బోధన విధానాలు, ఇంటర్ చదవడం ద్వారా భవిష్యత్తులో లభించే అవకాశాలను వివరిస్తూ, తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరితే జరిగే మేలును వివరిస్తున్నారు.

146 కళాశాలలు

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 146 కళాశాలలున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 15, హైస్కూల్ ప్లస్ 14, మోడల్ స్కూల్ 2, కేజీబీవీ 4, సాంఘిక సంక్షేమ కళాశాలలు 8, ప్రైవేటు ఎయిడెడ్ 4, ప్రైవేటు అన్ ఎయిడెడ్ 99 చొప్పున ఉన్నాయి. గత విద్యా సంవత్సరం పదో తరగతిలో 22,993 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో అత్యధికులు ఇంటర్మీడియెట్‌లో చేరనున్నారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫస్టియర్‌లో 11,783 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరందరూ ఈ ఏడాది ఇంటర్ సెకండియర్ విద్యను అభ్యసిస్తారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఫస్టియర్‌లో చేరికలు అధికంగా ఉండే అవకాశముందని అధ్యాపకులు భావిస్తున్నారు.

222 పనిదినాలు

సవరించిన అకడమిక్ క్యాలెండర్‌ను ఇంటర్మీడియెట్ విద్య కార్యదర్శి సౌరభ్‌గౌర్ గత నెల 31న విడుదల చేశారు. దీని ప్రకారం 2024–25 విద్యా సంవత్సరంలో 222 పనిదినాలుంటాయి. మొత్తం 304 రోజులకు 82 సెలవు దినాలున్నాయి. జూలై 29 నుంచి 31 వరకూ యూనిట్–1, ఆగస్టు 29 నుంచి 31 వరకూ యూనిట్–2, సెప్టెంబర్ 23 నుంచి 28 వరకూ క్వార్టర్లీ పరీక్షలు నిర్వహిస్తారు. అక్టోబర్ 3 నుంచి 11వ తేదీ వరకూ దసరా సెలవులు ప్రకటించారు. అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకూ యూనిట్–3, నవంబర్ 21 నుంచి 23 వరకూ యూనిట్–4 పరీక్షలు నిర్వహిస్తారు. డిసెంబర్ 16 నుంచి 21 వరకూ అర్ధ సంవత్సర పరీక్షలు నిర్వహించనున్నారు. జనవరి 13 నుంచి 18వ తేదీ వరకూ సంక్రాంతి సెలవులు ప్రకటించగా, ఫిబ్రవరి 3 నుంచి 10 వరకూ ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి రెండో వారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటి వారం నుంచి వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు. 2024–25 విద్యా సంవత్సరానికి మార్చి 31 చివరి పనిదినంగా ప్రకటించారు. ఇంటర్ ఫలితాల విడుదల అనంతరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే రెండో వారంలో ప్రకటిస్తారు. తిరిగి 2025–26 విద్యా సంవత్సరం జూన్ 2న ప్రారంభమవుతుందని వార్షిక క్యాలెండర్‌లో ప్రకటించారు.

10 వరకూ అడ్మిషన్లు



ఇంటర్మీడియెట్ తరగతులు శనివారం పునఃప్రారంభమయ్యాయి. తొలి రోజు మాత్రం హాజరు కొంత తక్కువగానే ఉన్నట్లు క్షేత్ర స్థాయి నుంచి నివేదికలు అందాయి. ఈ నెల 5వ తేదీ నుంచి విద్యార్థుల హాజరు పెరుగుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని కళాశాలలన్నీ వార్షిక క్యాలెండర్‌ను తప్పనిసరిగా పాటించాలి.

– జీజీకే నూకరాజు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి, కాకినాడ

ధరణీనాయక గోవిందా..

- కిక్కిరిసిన వాడపల్లి ఆలయం
- ఒక్కరోజే రూ.33.28 లక్షల ఆదాయం



ఆలయం వద్ద ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం: దినకర తేజా గోవిందా.. ధరణీనాయక గోవిందా.. నామస్మరణ కోనసీమ తిరుపతి వాడపల్లి క్షేత్రంలో మార్మోగింది.. అశేష భక్తజనం ఆ స్వామిని కొలుస్తూ తన్మయత్వం చెందింది.. వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. అనంతరం దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గౌతమీ గోదావరి నదిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయరాజు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఈఓ భూపతిరాజు మాట్లాడుతూ స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.33,28,574 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయం వద్ద ఏర్పాటైన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

గది దొరికితే ఒట్టు



- కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా కేంద్రానికి వస్తున్న నేతలు, కార్యకర్తలు
- హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాల్లో నిండిన రూములు
- ధరలు పెంచేసిన నిర్వాహకులు

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పుణ్యమా అని కాకినాడ నగరంలోని ప్రముఖ హోటళ్లు, లాడ్జీల్లో ఎక్కడా ఒక్క గది కూడా దొరకడం లేదు. అసలే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో సాధారణ ప్రజలు, ఇతర ప్రాంతాలు, జిల్లాల నుంచి వివిధ పనులపై ఇక్కడకు వస్తున్న వారికి గదులు లభించడం లేదు. ఈ నెల 4న జరిగే ఓట్ల లెక్కింపే దీనికి కారణం. ఆ రోజు ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు దగ్గరుండి తెలుసుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు నాయకులు, ప్రధాన కార్యకర్తలు నగరంలోని అన్ని ప్రముఖ హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాల్లోని గదులను ఇప్పటికే బుక్ చేసేసుకున్నారు. ముఖ్యంగా ఏసీ గదులను దాదాపు రిజర్వ్ చేసేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాలకు చెందిన ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, నేతలు, నాయకులు, కార్యకర్తలు ఆ రోజు నగరానికి చేరుకోనున్నారు. లెక్కింపు రోజున ఆయా గదుల నుంచి టీవీల ద్వారా, లెక్కింపు కేంద్రాల నుంచి నేరుగా వివరాలు తెలుసుకోనున్నారు. ఓట్ల లెక్కింపునకు ఇక రెండు రోజులే గడువు ఉండటంతో మరి కొంత మంది నాయకులు కూడా రెండు రోజులుగా నగరంలో రూముల కోసం హోటళ్లు, లాడ్జీలకు తెగ తిరిగేస్తున్నారు. ఎక్కడకు వెళ్లినా 'ఖాళీ లేవు.. అన్నీ బుక్ అయిపోయాయి.. ఎవరైనా రాకపోతే ఫోన్ చేస్తాం.. నంబరు ఇచ్చి వెళ్లండి' అంటూ సిబ్బంది సమాధానం చెబుతున్నారు. దీంతో వచ్చిన వారు నిరాశతో వెను తిరుగుతున్నారు. నగరంలో, గ్రామీణ ప్రాంతాల్లో గెస్ట్ ఇన్ పేరుతో అతిథి గృహాలు కూడా వెలిశాయి. వీటిని కూడా కొందరు నేతలు రిజర్వు చేసేసుకున్నారు. మీటింగ్ హాళ్లు, బార్ అండ్ రెస్టారెంట్ ఉన్నచోట ఫలితాలు ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు పెద్ద తెరలు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 9 నుంచి అర్ధరాత్రి పూర్తి ఫలితాలు వెలువడేంత వరకూ ఈ ఏర్పాట్లు చేస్తున్నారు.

పెరిగిన అద్దెలు

ఒక్కసారిగా గదులకు డిమాండ్ రావడంతో ఆయా హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులు అద్దెలు కూడా భారీగా పెంచేశారు. నగరంలో కొన్ని స్టార్ హోటళ్లున్నాయి. ఇంకొన్ని ఆధునిక సదుపాయాలున్న హోటళ్లున్నాయి. వీటితో పాటు ప్రముఖ లాడ్జీలకు కొదవ లేదు. మామూలు రోజుల్లో వీటిల్లో 24 గంటలకు (రోజుకు) ఏసీ, సాధారణ గదుల అద్దె రూ.1,200 నుంచి రూ.1,500 వరకూ ఉంటుంది. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడటంతో గదుల అద్దెలకు కూడా రెక్కలొచ్చాయి. ఒక్కో గది అద్దెను ఏకంగా రూ.2 వేల నుంచి రూ.2,500 వరకూ పెంచేశారు. పోలీసు అధికారులు కూడా గదుల కోసం నిర్వాహకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. తమ వారి కోసం గదులు ఉంచాలంటూ వారు హుకుం జారీ చేస్తున్నారు.

ప్రతి ఫామ్‌కూ ఓ లెక్క



కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికార యంత్రాంగం అనేక ఫామ్‌లు వినియోగిస్తుంది. వీటిల్లో ప్రతి ఫామ్‌కూ ఒక ప్రాధాన్యం ఉంది. అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఒకేసారి చేపడతారు. అసెంబ్లీ, పార్లమెంటరీ ఓట్ల లెక్కింపునకు చెరో 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉంటుంది. ఫలితాల బటన్ నొక్కగానే ప్రతి అభ్యర్థికీ పోలైన ఓట్లు ఈవీఎంలో కనిపిస్తాయి. ప్రతి రౌండ్ లెక్కింపునకు ముందు కౌంటింగ్ ఏజెంట్లతో 17–సీ ఫామ్‌లో తప్పనిసరిగా సంతకాలు తీసుకుంటారు. రౌండ్ల వారీగా ఫలితాలను ఫామ్–20లో నమోదు చేసి, కంట్రోల్ రూమ్, మీడియా కేంద్రాలకు తప్పనిసరిగా పంపిస్తారు. సువిధ యాప్‌లో నమోదు చేసిన తరువాత మాత్రమే రౌండ్ల వారీ ఫలితాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. ఒక్కో రౌండ్‌కు 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు.

కీలక ఫామ్‌లు ఇవీ..

- ఓట్ల లెక్కింపులో వివిధ దశలకు ఎన్నికల కమిషన్ వివిధ ఫామ్‌లను నిర్దేశించింది.
- ఫామ్–18: కౌంటింగ్ ఏజెంట్ నియామకపత్రం. ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) జారీ చేసిన ఈ ధ్రువపత్రం ఉంటేనే అభ్యర్థుల ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రం లోపలకు అనుమతిస్తారు.
- ఎనగ్జర్–38: ఓట్ల లెక్కింపునకు నియమితులైన పర్యవేక్షకులు, సహాయకులకు జారీ చేసే ధ్రువీకరణ పత్రం.
- ఎనగ్జర్–ఎ: ఎంపిక చేసిన ఐదు వీవీ ప్యాట్ల వివరాలు ఉంటాయి.
- ఎనగ్జర్–బి: వీవీ ప్యాట్లలోని స్లిప్పుల లెక్కింపు తరువాత ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ఎన్నికల పరిశీలకుడు ధ్రువీకరించే పత్రం.
- ఫారం–21సీ: ఓట్ల లెక్కింపు అనంతరం వెంటనే ఫలితాలు దీనిలో నమోదు చేస్తారు.
- ఫారం–21ఇ: నియోజకవర్గంలో ఏ పార్టీకి, అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయి, ఎవరు విజయ సాధించారనే సమగ్ర వివరాలు దీనిలో ఉంటాయి.
- ఫారం–22: విజయం సాధించిన అభ్యర్థికి ఎన్నికల అధికారి జారీ చేసే ధ్రువపత్రం. దీని ద్వారానే చట్టసభల్లో సభ్యులుగా ఎంపికవుతారు.

ఎనగ్జర్–58: పార్ట్–1లో పోలింగ్ బూత్‌ల వారీగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల వివరాలుంటాయి. పార్ట్–2లో పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల లెక్కింపు, ఆధిక్యాలు, ఫలితాల వివరాలుంటాయి.

ఎనగ్జర్–39: దీనిలో తుది ఫలితం వివరాలు సమగ్రంగా ఉంటాయి. పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల ఆధిక్యతలు నోటాతో సహా పొందుపరుస్తారు. ఆర్‌ఓ సంతకం చేసిన తరువాత దీనిని అధికారికంగా విడుదల చేస్తారు.

శృంగార వల్లభుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభస్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. వేకువజాము నుంచే వచ్చిన భక్తులు స్వామివారికి ముడుపులు, మొక్కులు చెల్లించారు. ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణతో పాటు, అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాలు, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.3,09,533 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.

గలగలా గోదారి

- ఖరీఫ్‌కు సాగునీరు విడుదల
- గేట్ల స్విచ్ ఆన్ చేసి నీటిని వదిలిన కలెక్టర్
- రైతులు సకాలంలో నాట్లు వేసుకోవాలని సూచన



గోదారమ్మకు పసుపు, కుంకుమ, చీర సమర్పిస్తున్న కలెక్టర్ మాధవీలత



తూర్పు డెల్టా కాలువకు విడుదలవుతున్న గోదావరి జలాలు

ధవళేశ్వరం: గోదారమ్మ గలగలా కదిలింది. కాటన్ బ్యారేజీ నుంచి పంట చేల వైపు పయనం ఆరంభించింది. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుంటూ.. స్వేదం చిందిస్తూ.. పసిడి పంటలు పండించే అన్నదాతలకు తోడుగా నిలవాలని.. పరవళ్లు తొక్కుతూ ఉరకలెత్తింది. డెల్టాలో ఖరీఫ్ పంటల సాగుకు ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేసిన వేళ.. ఈ అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. జిల్లా కలెక్టర్ కె.మాధవీలత బ్యారేజ్ గేట్ల స్విచ్ ఆన్ చేసి గోదావరి డెల్టా కాలువలకు శనివారం నీటిని విడుదల చేశారు. తొలుత గోదావరి మాతకు ఆమె శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల పరిధిలో 10,13,161 ఎకరాలకు కాటన్ బ్యారేజీ నుంచి సాగునీరు అందిస్తున్నామన్నారు. రైతులు సకాలంలో నాట్లు వేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ త్వరగా ప్రారంభించడం ద్వారా ప్రకృతి విపత్తులు, తుపానులు, వరదల ముంపు బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చని చెప్పారు. దీనివలన పంట దిగుబడులు రైతుల చేతికి అందుతాయన్నారు. ఖరీఫ్ సకాలంలో పూర్తి చేయడం ద్వారా రబీ త్వరగా ప్రారంభించడానికి అవకాశం ఉంటుందని, తద్వారా ఆ సీజన్‌లో కూడా సాగుకు పూర్తి స్థాయిలో నీరు అందుతుందని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకునే జూన్ 1న డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశామని చెప్పారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఖరీఫ్ సాగు సకాలంలో ప్రారంభించేలా వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో సూచనలు ఇవ్వాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. ఈసారి రబీ సీజన్ ముగిసిన 21 రోజుల అనంతరం ఖరీఫ్‌కు నీటిని విడుదల చేశారు. తొలి రోజున డెల్టా కాలువలకు మొత్తం 2,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. తూర్పు డెల్టాకు 500, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 1,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. బ్యారేజీ నుంచి సాయంత్రం 3,197 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. కార్యక్రమంలో గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్ కుమార్, ఇరిగేషన్ ఎస్‌ఈ జి.శ్రీనివాస్, ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, ఏఈ అద్దంకి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.



తూర్పు డెల్టా కాలువకు నీరు విడుదల చేస్తున్న కలెక్టర్

ఐసెట్‌లో ఆదిత్య డిగ్రీ విద్యార్థుల హవా


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ సుగుణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏపీ ఐసెట్– 2024 ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాలల విద్యార్థులు బి.కార్తీక్ రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు, ఎస్.దశరథ రామరెడ్డి 6వ ర్యాంకు, అనుపమ 8వ ర్యాంకు సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.సుగుణ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ విద్యార్థులు 10 లోపు మూడు, 100 లోపు 22, వెయ్యి లోపు 95 ర్యాంకులు సాధించారన్నారు. ఎల్.యశ్వంత్ సాయిరామ్ కుమార్ 19, కె.నాగదుర్గా ప్రసాద్‌కు 27, ఎ.తరుణ్ ఆదిత్య శ్రీవర్ధన్‌కు 28, బి.శ్రీకాంత్‌కు 33, కేడీఎస్ నిఖితకు 39, సీహెచ్ దేవి శైలజకు 43, కె.శ్రీసాయి వినయ్‌కు 58, ఎస్.నితిన్‌సాగర్‌కు 62, పీవీఎల్ దివ్యకు 63, ఎ.ఐజాక్ బాబుకు 64, కె.లక్ష్మీప్రసన్నకు 69, ఎ.మానసప్రియకు 71, వి.ధరణికి 73, బి.నయనకు 74 ర్యాంకు వచ్చిందని వివరించారు. ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ ర్యాంకులతో పాటు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా 52 ఎంఎన్‌సీల్లో తమ విద్యార్థులు 140 పైగా ఉద్యోగాలు సాధించారన్నారు. సమావేశంలో ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, ఎస్ఎన్ రెహమాన్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

అనపర్తి: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు సామర్లకోట జీఆర్పీ ఎస్సై లో వరాజు తెలిపారు. అనపర్తికి చెందిన గొలుగూరి వెంకటరెడ్డి (58) స్థానికంగా ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు.

శనివారం సొంత పనిపై రైల్వే గేటు అవతలి వైపునకు వెళ్లి వెంకటరెడ్డి తిరిగి వస్తూ రైలు పట్టాలు దాటుతుండగా ఖరగ్‌పూర్ వెళ్లే స్పెషల్ రైలు ఢీకొంది. దీంతో అతను మృతి చెందాడు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులే..

- ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట చర్యలు
- విజయోత్సవాలు, ర్యాలీలకు అనుమతుల్లేవు
- ఏలూరు రేంజ్ శాంతి భద్రతల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి రవిప్రకాష్


అమలాపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీ రవిప్రకాష్, చిత్రంలో జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలోని జిల్లాల్లో ఈ నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఐజీ, ఏలూరు రేంజ్ శాంతి భద్రతల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి ఎం.రవిప్రకాష్ విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌తో కలిసి రవిప్రకాష్ మాట్లాడారు. రేంజ్ పరిధిలో ఒక్క కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో మినహా మిగిలిన చోట్ల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు కూడా అంతే ప్రశాంతంగా జరిగేందుకు ఆయా జిల్లాల పోలీస్ శాఖలు సకల బందోబస్తు ఏర్పాట్లు చేశాయని ఐజీ వెల్లడించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే పోలీసు కేసులు తప్పవని, తద్వారా భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలకు అనుమతుల్లేవని స్పష్టం చేశారు.

క్యూఆర్ టీమ్‌ల ఏర్పాటు

రేంజ్‌లోని కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లాల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో హింసాత్మక సంఘటలను తక్షణమే అదుపు చేసేందుకు కొత్తగా క్విక్ రియాక్షన్ (క్యూఆర్) టీమ్‌లను ఏర్పాటు చేశామని రవిప్రకాష్ తెలిపారు. ఏ గ్రామంలోనైనా ఘర్షణ లేదా వివాదం జరిగిన వెంటనే అదుపు చేసేందుకు క్యూఆర్ టీమ్‌లు సంసిద్ధమై ఉంటాయని చెప్పారు. సంఘటన జరిగిన ఐదు నుంచి పది నిమిషాల్లో సంఘటనా స్థలంలో ఉండేలా క్యూఆర్ టీమ్‌లు పనిచేస్తాయని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, పశ్చిమ గోదావరి జిల్లాలో దెందులూరు, కృష్ణా జిల్లాలో నూజివీడు, గన్నవరం, పెనమలూరు తదితర నియోజకవర్గాల్లో పోలీసు బందోబస్తుపరంగా ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు.

ప్రతి జిల్లా ఇన్‌చార్జిగా ఎస్పీ

ప్రతి జిల్లా ఓట్ల లెక్కింపు కేంద్రానికి ఆ జిల్లా ఎస్పీ ఇన్‌చార్జిగా ఉండి బందోబస్తును పర్యవేక్షిస్తారని రవిప్రకాష్ అన్నారు. పోలీసు బలగాల కంపెనీలు, పార్టీలు, టీమ్‌లకు ఓ సీఐ, ఎస్సైలు ఇన్‌చార్జులుగా ఉండి వాటిని నిర్వహిస్తారని చెప్పారు. జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచే ఐజీ రవిప్రకాష్ రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఐజీ రవిప్రకాష్ జిల్లా ఎస్పీ శ్రీధర్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, స్పెషల్ బ్రాంచి సీఐలతో జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

ప్రతి జిల్లాలో ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, జిల్లా ఆర్మ్‌డ్ బలగాలు, జిల్లా పోలీసు యంత్రాంగంతో మూడంచెల బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి వచ్చే ఏజెంట్లు, రాజకీయ పార్టీల అభ్యర్థులను నఖశిఖ పర్యంతం తనిఖీలు చేసిన తర్వాతే తగిన ధ్రువీకరణ పత్రాలతో లోనికి అనుమతిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద రెడ్ జోన్లు, నో ఫ్లయింగ్ జోన్లు, నో మెన్, నో వెహికల్ జోన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇవి కాకుండా ఓట్ల లెక్కింపు సమయాల్లో, అభ్యర్థుల గెలుపు, ఓటమిల దృష్ట్యా అనివార్యమయ్యే ఘర్షణలు, విబేధాలపై పోలీసు నిఘా విస్తృతంగా ఉంటుందని వివరించారు.

అందరిచూపు టి-20 వరల్డ్ కప్ పైనే..


డాక్టర్ శివ కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రికెట్ క్రీడాకారులను భారత్‌లో దేవుళ్లతో సమానంగా చూస్తారు. 130 కోట్ల మంది భారతీయుల ఆశల తగ్గట్టుగా భారత్ జట్టు ఈ నెల 2వ తేదీ ఆదివారం నుంచి అమెరికాలో టి-20 వరల్డ్ కప్ ఆడనుంది. యువ క్రికెటర్లతో మంచి ఫామ్‌లో ఉన్న మన జట్టు టి-20 వరల్డ్ కప్‌ను గెలుచుకుని అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతుందా లేదా అనే దానిపై ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ నెలకొంది. యూఎస్‌లో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న టి-20 వరల్డ్ కప్‌లో భారత జట్టు విజయ సాధ్యాసాధ్యాలపై 'సాక్షి'తో జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ మాట్లాడారు. టి-20 వరల్డ్ కప్‌లో జట్టు సగటు స్కోర్ 170–180 నమోదు చేస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. సెమీ ఫైనల్స్‌కు ఇండియా, వెస్టిండీస్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చేరుకోవచ్చని శివ కుమార్ అన్నారు. ఈ వరల్డ్ కప్‌లో మ్యాచ్ ఆఫ్ ది సిరీస్‌గా విరాట్ కోహ్లి, మిచెల్ స్టార్క్, రోహిత్ శర్మ నిలుస్తారని అనుకుంటానన్నారు. ఈ కప్‌ను కైవశం చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఇండియా, వెస్టిండీస్, ఆస్ట్రేలియాలకు ఉందన్నారు.

పంట కాలువలో వృద్ధుడి మృతదేహం


వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కరప: నడకుదురు సమీపంలోని పంట కాలువలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. కరప ఎస్ఐ టి.రామకృష్ణ కథనం ప్రకారం.. కరప మండలం నడకుదురు శివారున పంట కాలువలో ఓ వృద్ధుడి మృతదేహం ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. అతని వయసు సుమారు 60 నుంచి 70 ఏళ్ల మధ్యలో ఉంటుందని, చేపలు వేటాడుతూ ప్రమాదవశాత్తూ కాలుజారి కాలువలో పడి మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. సదరు వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే కరప పోలీస్ స్టేషన్ నంబర్ 0884 2394833, ఎస్ఐ నంబర్ 94407 96557లకు సమాచారం అందించాలని ఎస్ఐ రామకృష్ణ కోరారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

సత్యదేవుని రథానికి రక్షణ



సాక్షి దినపత్రికలో గురువారం వచ్చిన కథనం


ఎండ, వానల నుంచి రక్షణకు టేకు రథంపై కప్పిన టార్పాలిన్

టార్పాలిన్, సీసీ కెమెరాల ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ఊరేగించేందుకు రూ.1.08 కోట్లతో తయారు చేయించిన 36 అడుగుల టేకు రథానికి అధికారులు రక్షణ ఏర్పాట్లు చేపట్టారు. శనివారం ఆ రథానికి టార్పాలిన్ కప్పడంతో పాటు ఆ రథం వద్దకు ఎవరూ వెళ్లకుండా చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అదే విధంగా రథం చుట్టూ సీసీ టీవీ కెమెరాలు అమర్చారు. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గత నెల 22న ఈ రథంపై గ్రామంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆ రథాన్ని పంపా సత్రంలో ఉంచి ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. అది ఎండకు ఎండి, వానకు తడుస్తుండడంతో గురువారం 'సాక్షి' దినపత్రికలో 'తేరుకు రక్షణ ఈ తీరునా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఈఓ కె.రామచంద్రమోహన్ రథంపై వెంటనే రక్షణ ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో టార్పాలిన్‌తోపాటు రథం చుట్టూ ఫెన్సింగ్, అక్కడ సీసీ టీవీ కెమేరాలు అమర్చారు. కాగా, త్వరలో జరిగే దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశంలో రథానికి శాశ్వతంగా షెడ్డు నిర్మించేందుకు స్థలం ఖరారు చేసి, పనులకు టెండర్లు పిలుస్తామని డీఈ ఉదయ్ తెలిపారు.


రథం సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

పట్టాభి ఆగ్రో ఫుడ్స్‌లో కార్మికుడి మృతి


మృతుడు దేవుడు (ఫైల్)

పెద్దాపురం: స్థానిక వాలు తిమ్మాపురం రోడ్డులోని పట్టాభి ఆగ్రో ఫుడ్స్ రైస్‌మిల్లులో పట్టణానికి చెందిన ఆ ఫ్యాక్టరీ కార్మికుడు ఉల్లి దేవుడు (36) శనివారం మృతి చెందాడు. ఈ సంఘటనను యజమాన్యం గోప్యంగా ఉంచి మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించిందని సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులు డి.క్రాంతికుమార్, చెక్కా రాజ్‌కుమార్ తెలుసుకున్నారు. దీంతో ఆసుపత్రికి చేరుకుని విషయం తెలుసుకుని, జిల్లా పరిశ్రమల అధికారికి ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. పారా బాయిలర్ వద్ద పని చేస్తున్న దేవుడుపై మోటార్ విడిభాగాలు పడటంతోనే అక్కడికక్కడే మృతి చెందాడని, యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఇది జరిగిందని వారు ఆందోళన చేపట్టారు. దీనిపై జిల్లా పరిశ్రమ అధికారులకు ఫిర్యాదు చేసి కార్మికుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవుడుకు భార్య అరుణ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ విషయమై ఎస్ఐ సురేష్‌ను వివరణ కోరగా ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని అన్నారు.